తరంగాలు
రిపోర్టర్లు కావలెను
అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.
సంప్రదించండి...
ఎడిటర్: గడ్డం నాగరాజు గౌడ్
94949 23460

https://epaper.tharangalu.in
RNI. TELTEL / 2022 / 83463
జాతీయ దిన పత్రిక
# తరంగాలు
Tharangalu Daily News Paper
ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్
మంగళవారం
14 ఏప్రిల్ 2026
సంపుటి 03
సంచిక 186
పేజీలు 8
వెల రూ.5.00

Published From : Hyderabad,Circulated:Telangana,Andhrapradesh
Epaper: www.tharangalu.in.com

ఖనిజ రంగంలో స్వయం సమృద్ధి

## దిశగా భారత్



- హైదరాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- క్లిష్టమైన ఖనిజాల బ్లాకుల వేలం రోడ్‌షోలో పాల్గొన్న మంత్రి
- వికసిత భారత్ 2047 లక్ష్య సాధనలో ఖనిజాలదే కీలక పాత్ర
- ఏడవ విడతలో 19 కొత్త బ్లాకుల వేలానికి రంగం సిద్ధం

హైదరాబాద్, ఏప్రిల్ 13(తరంగాలు ప్రతినిధి): భారతదేశ ఖనిజ భద్రతను బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన 'క్లిష్టమైన ఖనిజాల బ్లాకుల ఏడవ విడత వేలం మిగతా 2వ పేజిలో..



## ఆర్టీసీ సమ్మె సైరన్

- ఏప్రిల్ 22 నుంచి రాష్ట్రవ్యాప్తంగా బస్సులు నిలిచే ప్రమాదం
- 32 డిమాండ్లతో జేఏసీ కఠిన నిర్ణయం - - చర్చలకు తలొగ్గని ప్రభుత్వం?
- ప్రభుత్వంలో విలీనం, సమాన వేతనాల కోసం కార్మికుల పోరాటం
- లక్షలాది ప్రయాణికులకు ఇబ్బందులు -- రవాణా వ్యవస్థపై ప్రభావం



హైదరాబాద్, ఏప్రిల్ 13 (తరంగాలు ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో సమ్మె మబ్బులు కమ్ముకుంటున్నాయి. ఏప్రిల్ 22 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు ఆర్టీసీ జేఏసీ ప్రకటించడంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితి నెలకొంది. గత నెల 13న

ఎన్నికల్లో బయోమెట్రిక్ ఓటింగ్‌పై

## సుప్రీంకోర్టు నోటీసులు



- దొంగ ఓట్ల నివారణకు పిల్ దాఖలు
- కేంద్రం, ఈసీ, రాష్ట్రాలకు నోటీసులు జారీ
- భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం ఉండొచ్చు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 (తరంగాలు ప్రతినిధి): ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత పెంచడం, దొంగ ఓట్లను అరికట్టడం లక్ష్యంగా బయోమెట్రిక్ ఓటింగ్ విధానాన్ని అమలు చేయాలంటూ సుప్రీంకోర్టులో కీలక ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ పిల్‌ను బీజేపీ నేత, న్యాయవాది అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ సమర్పించారు. పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, ఐరిస్ వంటి సాంకేతిక పద్ధతులను వినియోగించాలన్నదే ప్రధాన డిమాండ్. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు ధర్మాసనం, కేంద్ర ప్రభుత్వం, భారత ఎన్నికల సంఘం, అలాగే రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ప్రధాన మిగతా 2వ పేజిలో..

చర్లపల్లి ఘటనలో

## సంచలన మలుపు

- ఆస్తి వివాదమే కారణమా?
- అత్తమామలపై భర్త ఆరోపణలు
- పోలీసుల దర్యాప్తు వేగవంతం

హైదరాబాద్, ఏప్రిల్ 13(తరంగాలు ప్రతినిధి): హైదరాబాద్ శివారు చర్లపల్లిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ విజయశాంతి రెడ్డి తన ఇద్దరు పిల్లలతో కలిసి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కొత్త కోణాలు వెలుగులోకి వచ్చాయి. ఆస్తి వివాదం కారణంగానే ఈ దారుణం జరిగిందని భర్త సురేందర్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు కీలక మలుపు తిరిగింది. ఈ ఏడాది జనవరి 31న విజయశాంతి రెడ్డి (38), ఆమె కుమార్తె చైతన్య రెడ్డి (18), కుమారుడు మిగతా 2వ పేజిలో..

ప్రేమ పేరుతో మోసం....

## బాలికపై దారుణం

- నగలు, డబ్బు కోసం పన్నిన కుట్ర
- స్నేహితులతో కలిసి సామూహిక అత్యాచారం
- ముగ్గురు అరెస్ట్... మరొకరి కోసం గాలింపు

బిజ్నోర్, ఏప్రిల్ 13(తరంగాలు ప్రతినిధి): : ఉత్తరప్రదేశ్‌లోని బిజ్నోర్ జిల్లాలో ప్రేమ పేరుతో జరిగిన దారుణ ఘటన కలకలం రేపింది. 15 ఏళ్ల బాలికను ఆమె ప్రియుడు మోసం చేసి ఇంట్లోని నగలు, డబ్బు తీసుకురావాలని ప్రేరేపించాడు. అనంతరం తన స్నేహితులతో కలిసి ఆమెపై మిగతా 2వ పేజిలో..

దేశ రాజకీయ సమతుల్యతకు సవాల్‌గా

## నియోజకవర్గాల పెంపు

- జీఎస్‌డీపీ హైబ్రీడ్ మోడల్‌కు సీఎం రేవంత్ రెడ్డి బలమైన వాదన
- ఉత్తర--దక్షిణ అసమానతలు పెరగకుండా సమతుల్య విధానం అవసరం
- మహిళా రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు, కానీ పెంపు ప్రక్రియ వేరు
- అఖిలపక్ష చర్చలు, నిపుణుల కమిటీతో సమగ్ర నిర్ణయం తీసుకోవాలి



హైదరాబాద్, ఏప్రిల్ 13(తరంగాలు ప్రతినిధి): దేశంలో నియోజకవర్గాల పెంపు, పునర్విభజన అంశం తీవ్ర చర్చకు దారి తీస్తున్న వేళ, తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కీలకమైన విస్తృత దృష్టికోణంతో కూడిన ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. జీఎస్‌డీపీ (రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి) ఆధారంగా హైబ్రీడ్ మోడల్‌ను అమలు చేయాలని సూచిస్తూ, ప్రస్తుత కేంద్ర ప్రతిపాదన దేశ సమతుల్యతను దెబ్బతీసే ప్రమాదం ఉందని తీవ్రంగా హెచ్చరించారు. ప్రస్తుతం లోక్‌సభలో ఉన్న 543 స్థానాలకు అదనంగా 50 శాతం సీట్లు పెంచాలనే ఆలోచనలో, కొత్తగా వచ్చే 272 స్థానాలను రెండు భాగాలుగా విభజించాలని సీఎం సూచించారు. అందులో 136 స్థానాలను ప్రస్తుత ప్రాతినిధ్యానికి అనుగుణంగా ప్రొరేటా పద్ధతిలో కేటాయించాలి. మిగిలిన 136 స్థానాలను దేశ ఆర్థికాభివృద్ధికి అత్యధికంగా తోడ్పడుతున్న రాష్ట్రాల జీఎస్‌డీపీ ప్రాతిపదికన కేటాయించాలి అని ప్రతిపాదించారు. ఇలా చేస్తే జనాభా, ఆర్థికాభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యం లభిస్తుందని వివరించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల విషయంలో మాత్రం తమ ప్రభుత్వం పూర్తిగా మద్దతుగా ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ బిల్లును ఆలస్యం చేయకుండా అమలు చేయాలని, ఇప్పటికే 2023లో మిగతా 2వ పేజిలో..



## దుద్దిళ్ల శ్రీపాదరావుకు సీఎం నివాళి

- సీఎం రేవంత్ రెడ్డి పుష్పాంజలి
- జూబ్లీహిల్స్ నివాసంలో నివాళులు
- శాసనసభకు వన్నె తెచ్చిన నాయకుడని కొనియాడిన సీఎం
- నేటి తరానికి స్ఫూర్తి అని వ్యాఖ్యలు

హైదరాబాద్, ఏప్రిల్ 13 (తరంగాలు ప్రతినిధి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మిగతా 2వ పేజిలో..

## మార్పు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు



- అవినీతి వ్యవస్థగా మారిందని డీఎంకేపై ఆరోపణలు
- ఎన్‌డీఏతో అభివృద్ధి వేగం పెరిగిందన్న ప్రధాని
- రైతుల ఖాతాల్లో నేరుగా నిధుల బదిలీ -- కేంద్ర పథకాల ప్రాధాన్యం

న్యూఢిల్లీ/చెన్నై, ఏప్రిల్ 13(తరంగాలు ప్రతినిధి): తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే ప్రభుత్వంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్రస్థాయిలో విమర్శలు మిగతా 2వ పేజిలో..

## అంబేడ్కర్ జయంతికి సర్వం సిద్ధం

- దేశవ్యాప్తంగా భారీ ఏర్పాట్లు
- పార్లమెంట్ నుంచి పల్లె దాకా ఘన నివాళులు
- బాబాసాహెబ్ ఆశయ స్మరణలో కోట్లాది మంది ప్రజలు
- రికార్డు స్థాయిలో భారీ ర్యాలీలు
- బాబాసాహెబ్ 135వ జయంతికి జాతీయ సెలవు
- హైదరాబాద్‌లో 125 అడుగుల విగ్రహం వద్ద వైభవం



డెస్క్, ఏప్రిల్ 13తరంగాలు (ప్రతినిధి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 135వ జయంతి వేడుకలకు దేశం సిద్ధమైంది. మిగతా 2వ పేజిలో..

# దేశ రాజకీయ సమతుల్యతకు సవాల్‌గా నియోజకవర్గాల పెంపు

ఆమోదం పొందినప్పటికీ అమలు జరగకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. అయితే మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పెంపుతో కలిపి ఒకే బిల్లుగా తీసుకురావడం రాజకీయంగా, రాజ్యాంగపరంగా సరైన విధానం కాదని వ్యాఖ్యానించారు.జనాభా ఆధారంగా మాత్రమే నియోజకవర్గాల పెంపు చేస్తే, ఉత్తరాది రాష్ట్రాలకు అధిక ప్రాతినిధ్యం లభించి, దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వెనుకబడే ప్రమాదం ఉందని సీఎం విశ్లేషించారు. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు భారీగా లాభపడుతుండగా, తెలంగాణ, కేరళ వంటి రాష్ట్రాలు రాజకీయంగా బలహీనపడే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఇది క్రమంగా దేశ రాజకీయ సమతుల్యతను దెబ్బతీసి, చిన్న రాష్ట్రాలను ద్వితీయ శ్రేణి స్థితికి నెట్టివేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ప్రధాన ఆర్థిక కేంద్రాలుగా నిలుస్తున్నాయని, ఆదాయం, ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని సీఎం గుర్తుచేశారు. అలాంటి రాష్ట్రాలను జనాభా ఆధారంగా మాత్రమే కొలిచి ప్రాతినిధ్యం తగ్గించడం అన్యాయమని అన్నారు. దేశ అభివృద్ధికి సహకరిస్తున్న రాష్ట్రాలకు తగిన గుర్తింపు, ప్రాతినిధ్యం ఉండాలని స్పష్టం చేశారు.

ఈ అంశంపై నిర్ణయం తీసుకునే ముందు అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని సీఎం డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు సేకరించి, శాసనసభల సూచనలు తీసుకుని, నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ఆ నివేదికను పార్లమెంట్‌లో చర్చించి, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాలని అన్నారు.ప్రస్తుతం జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా పరిగణనలోకి తీసుకోవాలని సీఎం పేర్కొన్నారు. 2028 నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని, అప్పటి వరకు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం అనవసర గందరగోళానికి దారితీస్తుందని హెచ్చరించారు. ప్రజల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ఈ అంశంలో పారదర్శకత, సమగ్రత అవసరమని చెప్పారు.దేశ రాజకీయ వ్యవస్థలో సమాన ప్రతినిధిత్వం, ప్రాంతీయ సమతుల్యత, ఆర్థిక న్యాయం అన్న మూడు అంశాలు కీలకమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మూడు లక్ష్యాలను సాధించేలా జీఎస్‌డీపీ హైబ్రీడ్ మోడల్ ఉత్తమ మార్గమని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనను గంభీరంగా పరిగణించాలన్నారు. దేశ భవిష్యత్తును నిర్ణయించే ఈ కీలక అంశంపై సమగ్ర చర్చ అవసరమని ఆయన పిలుపునిచ్చారు.

# మార్పు కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు

➢ మొదటి పేజి తరువాయి

గుప్పించారు. అవినీతిని వ్యవస్థలో భాగంగా మార్చేసిందని ఆరోపిస్తూ, ప్రతి శాఖలో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తలను ఉద్దేశించి వర్చువల్‌గా ప్రసంగించిన ఆయన, డీఎంకే పాలనపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. మోదీ మాట్లాడుతూ, పలువురు మంత్రులు అవినీతి కేసులు ఎదుర్కొంటున్నారని, అవినీతి, కమీషన్లు, వసూళ్లు డీఎంకే ప్రభుత్వానికి గుర్తింపుగా మారాయని ఆరోపించారు. తమిళనాడు ప్రజలు ఇప్పుడు మార్పు కోరుకుంటున్నారని, ఎన్‌డీఏ కూటమి వైపు ఆశతో చూస్తున్నారని తెలిపారు. డీఎంకే దుష్పరిపాలనకు తగిన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.గతంలో డీఎంకే కేంద్ర ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ తమిళనాడుకు పెద్దగా అభివృద్ధి జరగలేదని మోదీ విమర్శించారు. అయితే ప్రస్తుతం ఎన్‌డీఏ ప్రభుత్వం రైల్వేలు, రహదారులు, విమానాశ్రయాల వంటి రంగాల్లో భారీ ప్రాజెక్టులను తీసుకువచ్చి వేగంగా అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బీజేపీ కార్యకర్తల కృషితో రాష్ట్రంలో కొత్త రాజకీయ వాతావరణం ఏర్పడిందని తెలిపారు. రైతుల సంక్షేమమే ఎన్‌డీఏ ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని ప్రధాని స్పష్టం చేశారు. 'పీఎం కిసాన్ యోజన' వంటి పథకాల ద్వారా వేల కోట్ల రూపాయలు నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేసినట్లు వెల్లడించారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు నిధులు చేరే విధానం అమలు చేస్తున్నామని తెలిపారు.

అదేవిధంగా ఫసల్ బీమా యోజన కింద రైతులకు భారీగా బీమా క్లెయిమ్‌లు పరిష్కరించినట్లు చెప్పారు. ఈ సొమ్ము కూడా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యిందని వివరించారు. రైతులకు ఆర్థిక భద్రత కల్పించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. తమిళనాడులో వైద్య రంగ అభివృద్ధిపై కూడా మోదీ ప్రస్తావిస్తూ, గత దశాబ్దంలో 11 కొత్త వైద్య కళాశాలలు ఏర్పాటు చేశామని తెలిపారు. వైద్య సీట్ల సంఖ్య రెట్టింపు అయ్యిందని గుర్తు చేశారు. మొత్తం మీద రాష్ట్ర అభివృద్ధి కోసం ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, ప్రజలు మార్పు దిశగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# ప్రేమ పేరుతో మోసం... బాలికపై దారుణం

సామూహిక అత్యాచారానికి పాల్పడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. బాధిత బాలిక తన తల్లి, ఇద్దరు చెల్లెళ్లతో కలిసి నివసిస్తోంది. ఆమె తండ్రి విదేశాల్లో ఉద్యోగం చేస్తున్నాడు. ఈ సమయంలో టిటు పాల్ అనే యువకుడు ఆమెకు పరిచయమై, గత ఆరు నెలలుగా ఫోన్‌లో మాట్లాడుకుంటూ నమ్మకం కల్పించాడు. ఇంటి నుంచి నగలు, డబ్బు తీసుకొస్తే ఇద్దరం పారిపోయి పెళ్లి చేసుకుందామని చెప్పి ఆమెను మోసం చేశాడు. ఈ కుట్రలో భాగంగా ఏప్రిల్ 5న బాలికకు మత్తు మందు ఇచ్చి, దాన్ని ఆహారంలో కలిపితే కుటుంబ సభ్యులు స్పృహ కోల్పోతారని సూచించాడు.ఆ రాత్రే బాలిక మత్తు మందును ఆహారంలో కలపడంతో కుటుంబ సభ్యులు స్పృహ కోల్పోయారు. అనంతరం ఇంట్లోని బంగారు, వెండి నగలతో పాటు రూ.10,000 తీసుకుని బయటకు వచ్చింది. అక్కడికి వచ్చిన టిటు పాల్, తన స్నేహితులు దగ్గరలో ఉన్నారని చెప్పి ఒక గదికి తీసుకెళ్లాడు. అక్కడ అతడు తన ముగ్గురు స్నేహితులతో కలిసి బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డాడు. తర్వాత ఆమె వద్ద ఉన్న నగలు, డబ్బు తీసుకుని పరారయ్యారు.

తర్వాత బాలిక ఇంటికి చేరుకుని జరిగిన విషయాన్ని తన తల్లికి తెలిపింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు గ్రామానికి చేరుకుని బాలిక వాంగ్మూలం నమోదు చేశారు. బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. నిందితులైన టిటు పాల్‌తో పాటు ఇద్దరు స్నేహితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిలో ఒకరు మైనర్‌గా ఉన్నారు. పరారీలో ఉన్న మరో నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు కొనసాగుతోంది. టిటు పాల్‌పై ఇప్పటికే పలు కేసులు నమోదై ఉండటంతో అతని నేర చరిత్ర బయటపడింది.

# దుద్దిళ్ల శ్రీపాదరావుకు సీఎం నివాళి

➢ మొదటి పేజి తరువాయి

సేవలను స్మరించుకున్నారు. శ్రీపాదరావు తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడని సీఎం పేర్కొన్నారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అనేక పదవులను నిర్వహించి ప్రజాసేవలో తన ముద్ర వేశారని కొనియాడారు. శాసనసభ ఔన్నత్యాన్ని పెంపొందిస్తూ సభను హుందాగా నడిపిన తీరు ఎంతో శ్లాఘనీయమని సీఎం అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఆయన పాత్ర కీలకమని వివరించారు. నాయకత్వంలో ఆయన చూపిన విలువలు ఆదర్శప్రాయమని తెలిపారు.శ్రీపాదరావు జీవితం నేటి తరానికి గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజాసేవలో నిబద్ధతతో పనిచేసిన ఆయనను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేమ్ నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితరులు పాల్గొన్నారు. నాయకులు కలిసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. శ్రీపాదరావు సేవలను గుర్తుచేసుకుంటూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజాసేవలో ఆయన చూపిన మార్గం అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

## చర్లపల్లి ఘటనలో సంచలన మలుపు



విశాల్ రెడ్డి (17) చర్లపల్లి-ఘట్‌కేసర్ మధ్య గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపింది.

తాజాగా మేడిపల్లి పోలీసులను ఆశ్రయించిన సురేందర్ రెడ్డి తన అత్త పుష్పలత, బామ్మర్ది చిరంజీవి, అతని భార్యపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఆస్తి కోసం వారే తన భార్యను మానసికంగా వేధించారని, అదే ఆమెను ఈ దారుణ నిర్ణయం తీసుకునేలా చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. "నా భార్య, పిల్లలు పిరికివాళ్లు కాదు. సొంతవాళ్లే మోసం చేసి ఈ పరిస్థితికి తెచ్చారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాపిల్లలు చనిపోయిన తర్వాత కూడా ఆస్తి కోసం తనను బెదిరిస్తున్నారని సురేందర్ రెడ్డి ఆరోపించారు. ఇంట్లో ఉన్న సుమారు కేజీన్నర బంగారం, రూ.1.40 కోట్ల నగదును అత్త గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్లిందని పేర్కొన్నారు. ప్రస్తుతం తన ప్రాణాలకు ముప్పు ఉందని, తనను కూడా లక్ష్యంగా చేసుకున్నారని ఆయన భయాందోళన వ్యక్తం చేశారు.

తాను ఏదైనా ప్రమాదానికి గురైతే ఆస్తి మొత్తం తన తల్లిదండ్రులకు లేదా ట్రస్టుకు చెందేలా వీలునామా రాస్తానని స్పష్టం చేశారు. తన కుటుంబాన్ని నాశనం చేసిన వారికి ఒక్క రూపాయి కూడా దక్కనివ్వనని తెలిపారు.విజయశాంతి హైటెక్ సిటీలో టీమ్ లీడర్‌గా పనిచేస్తుండగా, సురేందర్ రెడ్డి దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. ఘటనకు ముందు రోజు పిల్లలను హాస్టల్ నుంచి ఇంటికి తీసుకొచ్చిన విజయశాంతి, అర్ధరాత్రి కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లినట్లు సీసీ కెమెరాల్లో రికార్డైంది.

భర్త ఫిర్యాదు నేపథ్యంలో పోలీసులు ఆస్తి వివాదం కోణంలో కేసును పునఃపరిశీలిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశారు. ఈ కేసులో మరిన్ని సంచలన అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని భావిస్తున్నారు.

## అంబేడ్కర్ జయంతికి సర్వం సిద్ధం

➢ మొదటి పేజి తరువాయి

(ఏప్రిల్ 14) దేశవ్యాప్తంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో అన్ని కార్యాలయాలు, విద్యాసంస్థలు మూతపడనున్నాయి. ఢిల్లీలోని పార్లమెంట్ ప్రాంగణంలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి బాబాసాహెబ్‌కు నివాళులు అర్పించనున్నారు. దేశంలోని ప్రతి గ్రామంలోనూ అంబేడ్కర్ విగ్రహాలను ముస్తాబు చేసి, ఉత్సవాలు నిర్వహించేందుకు దళిత సంఘాలు మరియు ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేశాయి. చైత్యభూమి, దీక్షాభూమి వంటి కీలక ప్రాంతాలకు లక్షలాది మంది అనుయాయులు తరలివస్తుండటంతో భద్రతను కట్టుదిట్టం చేశారు.

తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలు అంబరాన్నంటుతున్నాయి. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న 125 అడుగుల భారీ విగ్రహాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ముఖ్యమంత్రి మరియు ఇతర ప్రముఖులు రేపు ఇక్కడ నివాళులు అర్పించనున్నారు. నగరం మొత్తం నీలిరంగు జెండాలతో నిండిపోయింది. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. జిల్లాల్లో కూడా బైక్ ర్యాలీలు, అన్నదాన కార్యక్రమాలకు స్వచ్ఛంద సంస్థలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. అంబేడ్కర్ ఆశయాలను స్మరిస్తూ పలు చోట్ల సభలు, సమావేశాలు నిర్వహించనున్నారు.

మహారాష్ట్రలో అంబేడ్కర్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ముంబైలోని చైత్యభూమికి వచ్చే భక్తుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. అణగారిన వర్గాల కోసం ఆయన చేసిన పోరాటాన్ని గుర్తుచేస్తూ వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. సామాజిక సమానత్వం కోసం అంబేడ్కర్ పడ్డ తపనను చాటిచెప్పేలా అనేక చోట్ల రక్తదాన శిబిరాలు మరియు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. యువత పెద్ద ఎత్తున ఈ ఉత్సవాల్లో పాల్గొని బాబాసాహెబ్ స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు. సోషల్ మీడియాలో కూడా అంబేడ్కర్ సూక్తులు వైరల్ అవుతున్నాయి. విద్యార్థుల కోసం పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. రాజ్యాంగంపై అవగాహన కల్పించేలా వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను నేటి తరానికి వివరించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాలు సాగుతున్నాయి. పలు విశ్వవిద్యాలయాల్లో సెమినార్లు ఏర్పాటు చేసి ఆయన ఆర్థిక మరియు సామాజిక విశ్లేషణలపై మేధావులు చర్చిస్తున్నారు. అంబేడ్కర్ కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడు కాదని, ఆధునిక భారత నిర్మాత అని కొనియాడుతున్నారు. రేపు సాయంత్రం వేళ అంబేడ్కర్ విగ్రహాల వద్ద క్యాండిల్ మార్చ్‌లు నిర్వహించనున్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్యరాజ్యసమితి కార్యాలయంలో కూడా అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు ఆయనను మానవ హక్కుల పోరాట యోధునిగా కీర్తిస్తున్నారు. విదేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అంబేడ్కర్ స్టడీ సెంటర్స్ ఆధ్వర్యంలో వెబినార్లు నిర్వహిస్తున్నారు. భారత్ గర్వించదగ్గ గొప్ప మేధావికి నివాళిగా రేపు సాయంత్రం ప్రతి ఇంటిపై నీలి జెండా ఎగురవేయాలని సామాజిక సంఘాలు కోరుతున్నాయి. బాబాసాహెబ్ ఆశయ సాధనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని మేధావులు సందేశమిస్తున్నారు.

# ఖనిజ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్

➢ మొదటి పేజి తరువాయి

మరియు రెండవ విడత అన్వేషణ లైసెన్సుల' రోడ్‌షోలో కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశ ఆర్థిక భద్రత మరియు వాతావరణ మార్పుల నియంత్రణలో ఖనిజాల పాత్ర అత్యంత కీలకమని కొనియాడారు. వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకోవడంలో ఈ రంగం నిర్ణయాత్మక శక్తిగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రపంచ రాజకీయాల్లో మరియు ఆర్థిక వ్యవస్థలో క్లిష్టమైన ఖనిజాలు గుండెకాయ వంటివని కిషన్ రెడ్డి అభివర్ణించారు. అత్యాధునిక సాంకేతికత, గ్రీన్ ఎనర్జీ మరియు రక్షణ రంగాలకు అవసరమైన ఖనిజాల విషయంలో భారత్ స్వయం సమృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించి, దేశీయంగానే ఖనిజ వనరులను వెలికితీసేందుకు ప్రభుత్వం అన్ని రకాల ప్రోత్సాహకాలను అందిస్తోందని వెల్లడించారు. ఈ అన్వేషణ ప్రక్రియ దేశ పారిశ్రామిక వృద్ధికి కొత్త ఊపిరి పోస్తుందని ఆయన పేర్కొన్నారు.ఖనిజాల వేలం ప్రక్రియలో ప్రభుత్వం సాధించిన పురోగతిని మంత్రి ఈ సందర్భంగా వివరించారు. ఇప్పటివరకు ఆరు విడతల్లో మొత్తం 46 ఖనిజ బ్లాకులను విజయవంతంగా వేలం వేశామని, తాజాగా ఏడవ విడతలో మరో 19 బ్లాకులను వేలానికి ఉంచినట్లు తెలిపారు. భారతదేశంలోని అపారమైన ఖనిజ సంపదను వెలికితీసేందుకు పారదర్శకమైన విధానాలను అమలు చేస్తున్నామని చెప్పారు. దీనివల్ల ప్రభుత్వానికి ఆదాయం పెరగడమే కాకుండా, స్థానికంగా పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన వెల్లడించారు.మైనింగ్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. అన్వేషణ లైసెన్సుల మంజూరు ప్రక్రియను సరళీకృతం చేశామని, ఇది ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యావరణ హితమైన మైనింగ్ పద్ధతులను అనుసరిస్తూనే, దేశ అవసరాలకు సరిపడా ఖనిజాలను ఉత్పత్తి చేయడమే తమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ఈ రంగంలో జరుగుతున్న సంస్కరణలు భారతదేశాన్ని ప్రపంచ ఖనిజ పటంలో అగ్రస్థానంలో నిలుపుతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో గనుల శాఖ ఉన్నతాధికారులు, భూగర్భ శాస్త్రవేత్తలు మరియు వివిధ పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు. క్లిష్టమైన ఖనిజాల వెలికితీతలో ఎదురయ్యే సవాళ్లు మరియు పరిష్కార మార్గాలపై ఈ రోడ్‌షోలో సుదీర్ఘంగా చర్చించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఖనిజ అన్వేషణలో భారత్ సాధిస్తున్న ప్రగతిని ప్రతినిధులు కొనియాడారు. ఈ వేలం ప్రక్రియ విజయవంతం కావడం వల్ల భవిష్యత్తులో విద్యుత్ వాహనాలు మరియు ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ రంగాల్లో భారత్ ప్రపంచ తయారీ కేంద్రంగా మారుతుందని అధికారులు భావిస్తున్నారు.

### ఎన్నికల్లో బయోమెట్రిక్ ఓటింగ్‌పై

# సుప్రీంకోర్టు నోటీసులు

➢ మొదటి పేజి తరువాయి

న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి నేతృత్వంలోని బెంచ్ ఈ అంశంపై సమగ్ర వివరణ ఇవ్వాలని సూచించింది.

విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రస్తుత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ విధానాన్ని అమలు చేయడం సాధ్యం కాదని స్పష్టం చేసింది. ఎన్నికల ప్రక్రియ మధ్యలో నూతన సాంకేతిక మార్పులు చేయడం వల్ల అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడింది. అయితే, ఈ పిల్‌లో ఉన్న అంశాలను పూర్తిగా తిరస్కరించకుండా, భవిష్యత్ ఎన్నికల దృష్ట్యా పరిశీలిస్తామని కోర్టు తెలిపింది. రాబోయే పార్లమెంట్ ఎన్నికలు, తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ విధానం అమలు చేసే అవకాశాలపై విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

ప్రస్తుతం తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఈ పిల్‌ను తక్షణ అమలు పరిధిలోకి తీసుకురాలేమని కోర్టు పేర్కొంది. ఎన్నికల సమయాన మార్పులు చేపట్టడం పరిపాలనా పరంగా క్లిష్టమని తెలిపింది. ఇక దేశంలో ప్రతి ఎన్నికల సమయంలో దొంగ ఓట్ల అంశం చర్చనీయాంశంగా మారుతోంది. ఆధార్‌తో అనుసంధానమైన బయోమెట్రిక్ విధానం ద్వారా ఓటింగ్ నిర్వహిస్తే అక్రమాలను తగ్గించవచ్చని కొంతమంది నిపుణులు సూచిస్తున్నారు. అయితే గోప్యత, డేటా భద్రత, సాంకేతిక సమస్యలు వంటి అంశాలను కూడా సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని న్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఆర్టీసీ సమ్మె సైరన్

➢ మొదటి పేజి తరువాయి

సమ్మె నోటీసులు ఇచ్చినా ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కార్మిక సంఘాలు వెల్లడించాయి.

జేఏసీ వైస్‌ఛైర్మన్ థామస్ రెడ్డి మాట్లాడుతూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 32 కీలక డిమాండ్లు ప్రభుత్వానికి సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్చలు జరగలేదని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కారణంగా కార్మికులు ఆందోళన బాట పట్టాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టీసీని పూర్తిగా ప్రభుత్వంలో విలీనం చేయడం, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతభత్యాలు కల్పించడం, పెండింగ్ సమస్యలను పరిష్కరించడం వంటి అంశాలు ప్రధాన డిమాండ్లుగా ఉన్నాయి. అదేవిధంగా కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కూడా జేఏసీ డిమాండ్ చేస్తోంది. ఈ సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

ఈ సమ్మె అమల్లోకి వస్తే రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంది. రోజువారీ ఉద్యోగులు, విద్యార్థులు, గ్రామీణ ప్రాంత ప్రజలు బస్సులపై ఆధారపడటం వల్ల రవాణా వ్యవస్థ దెబ్బతినే అవకాశం ఉంది. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో ప్రజల రాకపోకలు పూర్తిగా స్తంభించే ప్రమాదం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వం సమ్మెను నివారించేందుకు వెంటనే చర్చలు ప్రారంభించాలని జేఏసీ కోరింది. చర్చలకు సానుకూలంగా స్పందిస్తే సమ్మెను పునఃపరిశీలించేందుకు సిద్ధమని తెలిపింది. అయితే ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన సంకేతాలు రాకపోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారుతోంది.

ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలకు పరిష్కారం కనుగొనకపోతే రాష్ట్రంలో రవాణా సంక్షోభం తలెత్తే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 13, (తరంగాలు ):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజులలో భాగంగా రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా తిమ్మంపేట గ్రామంలోఉప సర్పంచ్ మండల రాకేష్ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జఫర్గడ్ యస్ఐ రామారావు హాజరై వారు మాట్లాడుతూ రోడ్డు సేఫ్టీ పై అవగాహన సదస్సు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు హెల్మెట్ లేనిది ప్రయాణం చేయవద్దు అని చెప్పారు వాహనదారులు బ్రాండెడ్ హెల్మెట్లు ధరించాలని మద్యం సేవించి వాహనాలు నడపకూడదని ట్రాఫిక్ అధికారులు సూచనలు పాటించాలని ప్రజలకు ముఖ్య సూచనలు ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్వాడి టీచర్లు, సిఏలు, గ్రామ ప్రజలు, పంచాయతీ కార్యదర్శి పరశురాములు, తదితరులు పాల్గొనడం జరిగింది

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- మాజీ ఎంపీ నామ
- అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సాగిన కేసీఆర్ పదేళ్ల పాలన



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :** భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరూ కట్టుబడి కృషి చేయాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిందని గుర్తు చేశారు. తెలంగాణ అభివృద్ధిలో అంబేద్కర్ స్ఫూర్తి కీలకమని పేర్కొంటూ, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన నూతన సచివాలయానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టడం, అలాగే హైదరాబాద్‌లో 125 అడుగుల ఎత్తైన అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం గర్వకారణమని తెలిపారు. అంబేద్కర్ ఆశయాలను కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆచరణలో చూపించిందని చెప్పారు. రైతులకు రైతుబంధు, దళిత, బీసీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేసినట్టు వివరించారు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా దళితబంధు వంటి విప్లవాత్మక పథకాన్ని ప్రవేశపెట్టి దళిత వర్గాల ఆర్థిక పురోగతికి దోహదపడిందని తెలియజేశారు. అలాగే తెలంగాణలో బీఆర్ఎస్ హాయంలోనే అత్యధిక సంఖ్యలో గురుకుల విద్యాసంస్థలను ఏర్పాటు చేసి, దళిత బహుజన పిల్లలకు ఉచిత విద్యను అందించి, వారిని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా తీర్చిదిద్దినట్లు తెలిపారు. నూతన పార్లమెంట్ భవనానికి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు పెట్టాలని కేసీఆర్ ఆదేశాల మేరకు 17వ లోక్‌సభలో తన వంతు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు వెల్లడించారు.

## మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో కుట్టు మిషన్ల పంపిణి



**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఖమ్మం లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు క్యాంప్ ఆఫీసులో కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ...స్వయం శక్తితో మహిళలకి ఉపాది కలిగించాలనే ఉద్దేశ్యంతోనే ఇందిరమ్మ మహిళ శక్తి పథకాన్ని ప్రారంబించామన్నారు.మహిళా శక్తిలో భాగంగానే కుట్టు మిషన్లు పంపిణి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పథకాలు ఏర్పాటు చేసాం. గతంలో రేషన్ బియ్యం పక్కదారి పట్టేది.. ఇప్పుడు సంపన్నులు తినే బియ్యం ఇప్పుడు పేదలకి అందుబాటులోకి తెచ్చాము.ప్రయివేట్ పాఠశాల లకి ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సదుపాయాలు ప్రభుత్వమే కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి వెంకటలక్ష్మి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మండల మహిళా కాంగ్రెస్ శ్రేణులు

**ఇల్లందు ప్రతినిధి ఏప్రిల్ 13,( తరంగాలు):** ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య ఆశీస్సులతో, ఇల్లందు మున్సిపల్ కో -ఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికైన మడుగు సాంబమూర్తి - వెంకటలక్ష్మి దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన మండల మహిళ కాంగ్రెస్ శ్రేణులు, యదలపల్లి అనసూర్య,కల్తీ పద్మ, పాయం స్వాతి తది తదితరులు.



# కల్వకుర్తిమైనార్టీగురుకులకళాశాల విద్యార్థినిల ఉత్తమ ప్రతిభ

**కల్వకుర్తి ఏప్రిల్ 13 తెలంగాణ ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకుల కళాశాలలలో ఉచిత భోజనంతో పాటు వసతి కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుంది.ఇటీవల విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కల్వకుర్తి మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థినిలు రాష్ట్ర జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రభంజనం సృష్టించారు.ఇంటర్మీడియట్ ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో హరిణి 976, అఖిల 973,పూజా 970 మార్కులు సాధించారు.బైపీసీ ద్వితీయ సంవత్సరంలో సమీరా 991,యాస్మిన్ 986,రాణి 983,సలోమి 974, భవ్య 966 మార్కులు సాధించారు.ఎంపీసీ ప్రథమ సంవత్సరం ప్రణవి 466, నసీహ 462,రుబీనా 461 మార్కులు సాధించారు. బైపీసీ ప్రథమ సంవత్సరం సలేహా 436,సిమా 434, రుమీష 433 మార్కులు సాధించారు.విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకుడు 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి మొహమ్మద్ సోఫీ సోమవారం మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కల్వకుర్తి మున్సిపాలిటీ కౌన్సిలర్లు నాజియా మక్బూల్,షేక్ ఏజాస్,లు హాజరై



విద్యార్థినులకు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైనారిటీ గురుకుల కళాశాల విద్యార్థినిలు రాష్ట్ర జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని అన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకులాల ద్వారా నిరుపేద కుటుంబాల బిడ్డలకు నాణ్యమైన విద్యను అందిస్తుందని ఈ అవకాశాలను ప్రతి విద్యార్థిని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నతంగా రాణించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ చంద్రకళ,అధ్యాపకులతో పాటు ఐజేయు జర్నలిస్ట్ యూనియన్ కల్వకుర్తి మండల అధ్యక్షుడు ఎండి జహీర్,కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు ముక్తార్ధర్, అఖిల్,రహీం,విద్యార్థినుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఇమ్మానుయేల్ రాజ్



**జఫర్గడ్ ప్రతినిధి, ఏప్రిల్ 13,(తరంగాలు):** మండలంలోని (ఐ)తమ్మడిపల్లి గ్రామంలో నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ రాడపాక రాజ్ కుమార్ దివ్య దంపతుల కుమార్తె ఆరోహి మొదటి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్చార్జ్ సింగపురం ఇందిర తనయుడు యువ నాయకులు సింగపురం ఇమ్మానుయేల్ రాజ్ వారితోపాటు తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక,జనగాం జిల్లా ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ సింగపరం నాగయ్య,స్టేషన్ ఘనపూర్ మాజీ ఉపసర్పంచ్ సింగపురం వెంకటయ్య,సింగపురం కిరణ్ కుమార్,సింగపురం సందీప్,జఫర్గడ్ మండల నాయకులు మక్తర్ అలీ,రమేష్,మాజీ జెడ్పిటిసి సదయ్య,(ఐ) తమ్మడపల్లి గ్రామ సర్పంచ్ హరిబాబు,వార్డ్ మెంబర్లు రడపాక రెహమాన్,రడపక రవి,ఎడ్ల యాదమ్మ,మునిగల మంజుల,వెంకటాపురం గ్రామ మాజీ ఉపసర్పంచ్ మాదాసు భాస్కర్, జ్యోతి సీనియర్ నాయకులు సింగపురం రత్నం,ఐలయ్య, కనకయ్య దేవయ్య,తాటికొండ సంపత్,చిల్పూర్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చాగంటి మని,చిల్పూర్ మండల బీసీ సెల్ అధ్యక్షులు బాలరాజు,రాజ్ కుమార్,నారగోని సరిత గౌడ్, యువజన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలు

- బృంగి ఆనంద్ కుమార్ కి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపిన కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి



**కల్వకుర్తి ఏప్రిల్ 13 తరంగాలు ప్రతినిధి**
బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ జన్మదిన వేడుకలు సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగానిర్వహించారు.ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుండి మహబూబ్ నగర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి డాక్టర్ బాబా అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ స్థానిక నాయకులతో కలిసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలు ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు బాలాజీ సింగ్ , బృంగి ఆనంద్ కుమార్ కి శాలువా కప్పిశుభాకాంక్షలు తెలిపారు.ఈకార్యక్రమంలో కౌన్సిలర్ లు,కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.





## నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి భూమి పూజ చేసినసర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్.



**కల్వకుర్తి. ఏప్రిల్ 13 తరంగాలు ప్రతినిధి**
తలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో అంగన్వాడి భవన నిర్మాణానికి సర్పంచ్ వట్టెల నిర్మల శ్రీశైలం యాదవ్ భూమి పూజ చేసారు.ఈ సందర్భంగా వారు మాట్లాడాతూ పిల్లలను దృష్టిలో ఉంచుకొని సరైన సదుపాయాలతో నూతన అంగన్వాడీల నిర్మాణాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నుండి 12లక్షలరూపాయలతో ప్రత్యేకనిధులుకేటాయించారని తెలిపారు.చిన్నారులకు అనువైన విధంగా అంగన్వాడి కేంద్రాలను ఏర్పాటు చేయడం హర్షం వ్యక్తంచేశారు.శాశ్వత భవనాలు ఏర్పాటు చేసి మౌలికవసతులతోచిన్నారులకు మంచి సదుపాయాలు కల్పించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సప్పిడి అంజనేయులు ముదిరాజ్,సెక్రటరీ రమేష్ నాయక్ నాయకులు, మాజీ సర్పంచ్ మణెమ్మ, మోహన్ రెడ్డి,యాదయ్య,జానయ్య,వార్డు మెంబర్ దొరుబాయి లాలమ్మ జంగయ్య, ప్రైమరి స్కూల్ ప్రధానోపాధ్యాయులు పావని అంగన్వాడి ఉపాధ్యాయులు పద్మ, లక్ష్మి దేవి, ఆయాలు, యువకులు యాదయ్య,శేఖర్, పాండు, రేలంగి,రమేష్ ,నర్సింహా ,కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ ముందస్తు జయంతి వేడుకలు

**కేసముద్రం,మహబూబాబాద్ జిల్లా,ప్రతినిధి,ఏప్రిల్.13,తరంగాలు:** కేసముద్రం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భారత రాజ్యాంగ శిల్పి డా. బి.ఆర్. అంబేద్కర్ ముందస్తు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. రాజు ఆదేశానుసారం నిర్వహించబడింది.మొదటగా డా. బి ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు.అనంతరం సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ సి. హెచ్. మైసయ్య, ప్రధాన అతిథిగా ప్రసంగిస్తూ, డా. బి ఆర్ అంబేద్కర్ గారి జీవిత విశేషాలు, ఆయన సమాజానికి అందించిన సేవలు, సమానత్వం, సామాజిక న్యాయం కోసం చేసిన పోరాటం గురించి వివరించారు. విద్యార్థులు ఆయన బాటలో నడిచి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.అలాగే ఇతర అధ్యాపకులు కూడా ప్రసంగిస్తూ, అంబేద్కర్ గారి ఆలోచనలను నేటి యువత అవగాహన చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. విద్యార్థులు దేశ భవిష్యత్తు కావడంతో, వారు సమాజానికి ఉపయోగపడే విధంగా తమను తీర్చిదిద్దుకోవాలని సూచించారు.ఈ వేడుకల్లో కళాశాల అధ్యాపకులు, గడిగెల రాజు, అలువాల యాదగిరి , సోమ ప్రవీణ్, మహమ్మద్ మున్ని, . జి. రమేష్, ఎస్. రవి, బి. మంజుల, కె. రమాదేవి, షేక్ సలీం , ఎం. శిరీష, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్ట్స్ పంపిణీ





• ఇంటర్మీడియట్ మండల టాపర్లను సన్మానించిన ఏఎంసీ చైర్మన్
• గంట సంజీవరెడ్డి

**కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి,ఏప్రిల్.13, తరంగాలు:**కేసముద్రం మండలంలోని మోడల్ స్కూల్లో విద్యార్థిని విద్యార్థులకు టీ షర్ట్స్, ద వే ఆఫ్ సాల్వేషన్ మినిస్ట్రీ ఆధ్వర్యంలో పంపిణీ చేయగా పిడిఎస్ఎస్ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా స్పోర్ట్స్ టి షర్ట్స్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి చేతుల మీదుగా అందజేయడం జరిగింది. తదనంతరం ఇంటర్మీడియట్ మండల టాపర్ గా, రామ్ చరణ్,హేమ,, ఉషశ్రీ, రక్షిత, లను సన్మానించి, ఆయన మాట్లాడుతూ,కుటుంబానికి గ్రామానికి దేశానికి మంచి పేరు తేవాలని అన్నారు. విద్యార్థులు వేసవి సెలవుల్లో ఈత కోసం చెరువుల వద్దకు వెళ్లవద్దని క్రమశిక్షణతో ఇంటి వద్ద ఉండి చదువుకోవాలన్నారు.ఎండ అతి తీవ్రంగా ఉంది కనుక ఇంటి దగ్గరే ఉండాలని క్రీడలో కూడా విద్యార్థులు ఉన్నత స్థాయికి రావాలని, చదువు క్రీడా విద్యార్థులకు మంచి మార్గదర్శకంగా ఉంటుందని, తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, మీరు కూడా ఇతరులకు సేవ చేసే గుణాన్ని అలవరపరుచుకోవాలని ఆయన అన్నారు. దా వే ఆఫ్ సాల్వేషన్ మినిస్ట్రీ,, అధ్యక్ష కార్యదర్శులను బనిశెట్టి వెంకటేష్ విజయ అభినందిస్తూ, విద్యార్థులకు టీ షర్టు ఇవ్వడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పిడి ఎస్ఎస్ స్వచ్ఛంద సంస్థ అధినేతలు విజయ వెంకటేష్ లు మాట్లాడుతూ ఆ దేవుని దయ ప్రజల, మీ దీవెనలు ఉంటే ఇంక అనేక సేవా కార్యక్రమంలో దేశమంతా చేస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు గండి శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ వేల్పుల సుజాత రామచంద్ర ర్, ఉప సర్పంచ్ పెద్దగోని రవి,వేముల శ్రీనివాస్ రెడ్డి,రామ్మోహన్ రెడ్డి,,రాంబాబు, ప్రిన్సిపల్ పరిమి నవీన్, రవి, పి ఇ టి లలిత, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన కరంగా వ్యవసాయ మార్కెట్ పనులు




•భవిష్యత్ లో మిర్చి పంట భారీగా వస్తే రవాణాకు ఇబ్బందులు తలెత్తే అవకాశం
•అభివృద్ధి పనుల్లో జాప్యంతో ఇబ్బందులు పడుతున్న రైతులు
•ముఖ్య నాయకుల సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆర్జేసీ కృష్ణ

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో : ఖమ్మం** : వ్యవసాయ మార్కెట్ ఆధునీకరణ పనులు ఆందోళన కరంగా సాగుతున్నాయని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుండాల కృష్ణ ఆరోపించారు. సోమవారం ఖమ్మం నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన బి ఆర్ ఎస్ త్రీ టౌన్ ప్రాంత ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. రూ.150కోట్ల వ్యయంతో అంతర్జాతీయ స్థాయిలో మోడల్ మిర్చి మార్కెట్గా తీర్చిదిద్దుతున్నామంటూ చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తే ముందస్తు ప్రణాళిక లేమితో పూర్తి వాస్తు దోషంగా జరుగుతున్నట్లుగా ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో నిర్మాణం చేపట్టే మార్కెట్ విషయంలో ముందుగా చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, రైతు సంఘాలతో సమావేశాన్ని నిర్వహించి సలహాలు తీసుకోకపోవడం విడ్డూరమన్నారు. మార్కెట్ లోపలి ప్రాంగణాన్ని పెంచుతూ చుట్టూ ఉన్న రోడ్లన్నింటినీ తగ్గించడం వల్ల భవిష్యత్తుల్లో రవాణా వ్యవస్థకు తీవ్ర ఇబ్బందులను తెచ్చి పెడుతుందన్నారు. మార్కెట్ చుట్టూ ప్రస్తుతం ఉన్న 40 అడుగుల రోడ్లను కుంచించి 25అడుగులు ఉండేలా చేయడం అభివృద్ధి ఎలా అవుతుందో పాలకులు సమాదానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఖమ్మం నగరంలోని రోడ్లన్నింటినీ వెడల్పు చేస్తుంటే అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి జరిగే మార్కెట్ చుట్టు ఉన్న రోడ్లను తగ్గించడం సరైనది కాదన్నారు. భవిష్యత్తులో మార్కెట్కు పెద్ద మొత్తంగా మిర్చి తరలివస్తే మార్కెట్లోకి వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అంతేకాక గ్రెయిన్ మార్కెట్ ప్రధాన గేటు నుంచి లోపలి కి వెళ్లే రోడ్డును తొలగించి భారీ షెడ్లను నిర్మించడం పూర్తి వాస్తుదోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. భారీ వాహనాలు మార్కెట్ లోపలికి వెళ్లే పరిస్థితి లేకుండా ప్రస్తుత మార్కెట్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. త్రీటౌన్ ప్రాంతానికి గుండెకాయ లాంటి వ్యవసాయ మార్కెట్ అభివృద్ధిని ప్రణాళిక లేమితో చేపట్టి రూ.కోట్ల ప్రజాధనాన్ని వృథా చేయడం బాధాకరమన్నారు. సంక్రాంతి నాటికే మోడల్ మార్కెట్ పనులు పూర్తి చేసి రైతులకు అప్పగిస్తామని చెప్పిన అధికారులు.. ఆ దిశగా పనులు ముగించకపోవడం మార్కెట్ లో పనులు జరిగే తీరు ను తెలియ జెస్తుందన్నారు. ఇప్పటికే వ్యవసాయ మార్కెట్లో లో ఉద్యోగుల కొరత తీవ్రంగా ఉందని.. మోడల్ మార్కెట్ పనులు పూర్తయ్యే నాటికి అంతర్జాతీయ స్థాయి మార్కెట్కు తగినట్లుగా ఉద్యోగుల నియామకం చేపట్టాలని కోరారు.అంతేకాక అంతర్జాతీయ మిర్చి హబ్ గా తయ్యారయ్యే మార్కెట్ కు అనుగుణంగా రైతులకు అవసరమైన సౌకర్యాలను సైతం సమకూర్చాలన్నారు. ప్రభుత్వమే కోల్డ్ స్టోరేజీ, గోదాముల నిర్మాణం చేపట్టి రైతులు ఉచితంగా పంటలను దాచుకునే వెసులుబాటు కల్పించాలన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో రూ.4కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన షెడ్లఆనవాళ్లు లేకుండా చేసిన అధికారులు, వాటికి వేలం వేసిన దాఖలాలు లేవని అన్నారు. సమావేశంలో మాజీ మార్కెట్ కమిటి డైరెక్టర్ పసుమర్తి రామ్మోహన్రావు బిఆర్ఎస్ నాయకులు కస్తూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

# మా దేవతల గుళ్ళల్లో మేమే పూజారులుగా ఉండాలి




•రెడ్ల ఆధిపత్యం మాకొద్దు
•కాదంటే దేనికైనా సిద్ధం
•లంబాడీల ఐక్యవేదిక కమిటీ సభ్యులు

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో** : ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రెస్ క్లబ్ లో భావసంగ్ మహారాజ్ మ్యారామా భవాని పేర్లని విస్మరిస్తూ మరిపెడ మండల మాకుల తండా మాకుల దేవాలయ దేవాదాయ శాఖ అధికారులు చేసిన దుశ్చర్యలను ఖండిస్తూ లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ముఖ్య స్వయ కర్త జాదవ్ రమేష్ నాయక్ పోస్టర్ ఆవిష్కరణ ప్రెస్ మీట్ ను నిర్వహించడం జరిగింది. మాకుల దేవాలయ నిర్మాణ భూమి దాతల మాజీ ఎంపీ మాజీ ఎమ్మెల్యే సురేందర్ రెడ్డి చెప్పిన విధముగా పోయిన సంవత్సరం ఏప్రిల్ 9 వ తారీకున మ్యారమా భవానీ విగ్రహ ప్రతిష్ట ఆయన చేతుల మీదుగా చేయడం జరిగింది. కానీ ఇప్పటి వరకు గుడి మీద ఎలాంటి శిలాఫలకం కూడా లేకపోవడం శోచనీయం అని తెలియ చేశారు, అలాగే బ్రహ్మోత్సవాల సందర్భముగా సురేందర్ రెడ్డి అలాగే దేవాలయ శాఖ ఉత్తర్వుల ప్రకారం కాలిన శ్రీ మారెమ్మ తల్లి పేరు మీద ప్రచురితం అయిన గోడ పత్రికలు బదులు అయిన వారి పై చర్య తీసుకోవాలని, మా దేవతల గుళ్ళల్లో మేమే పూజారులుగా ఉండాలని కోరారు. ప్రతి ఆదివారం జాతర సందర్భముగా వేలాది మంది లంబాడీ భక్తులు భావసంగ్ బావను దర్శించుకొని మొక్కులు చెల్లించి భోగ్ భండార్ కార్యక్రమం చేస్తామని తెలియచేశారు.అలాగే పక్కనే ఉన్న మ్యారామ భవానికి యేట పోతులను కోసి మొక్కులు చెల్లిస్తారు.అని చెప్పారు ఇక్కడ కేవలం భావసంగ్ బావా కోసం మాత్రమే అలాగే మ్యారమా భవాని కోసం మాత్రమే లంబాడీలు వస్తారు. కనుక వారి మనోభావాలు దెబ్బ తీయకుండా అలాగే ఇతర కులాల భక్తుల మనోభావాలు కించపరచకుండా భావసంగ్ బావా పేరు ను అలాగే మ్యారమా భవానీ పేరును ఉన్న పేర్లతో పాటుగా కొనసాగించాలని కోరుతున్నాము చెప్పారు.ఈ కార్య క్రమం లో లైవ్ అడ్వకేట్ విభాగ రాష్ట్ర కార్య దర్శి భూక్యా హరి నాయక్, బ్లూ ఇండియా పార్టీ రాష్ట్ర నాయకులు బానోతు లింగా నాయక్,లైవ్ భద్రాద్రి జోనల్ కోఆర్డినేటర్ జాదవ్ మంగీలాల్ , జిల్లా అడ్వకేట్ విభాగ సెక్రటరీ మణి మాల , బ్లూ ఇండియా పార్టీ జిల్లా నాయకులు హరి నాయక్ ,లైవ్ డోర్నకల్ నియోజక వర్గ అధ్యక్షులు ప్రవీణ్ నాయక్ , పాలేరు నియోజక వర్గ అధ్యక్షులు శోభన్ నాయక్ , సేవాలాల్ సేన నియోజక వర్గ ఇంచార్జీ నరేష్ నాయక్ , లైవ్ బావోజీల సంఘ రాష్ట్ర నాయకులు బానోతు సీతారామ్ నాయక్ , లైవ్ మరిపెడ మండల అధ్యక్షులు దేవేందర్ నాయక్ లు పాల్గొన్నారు.

# రహదారి భద్రత అరైవ్- అలైవ్

•మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న



కేసముద్రం, మహబూబాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్.13,తరంగాలు:రహదారి భద్రత అరైవ్- అలైవ్ కార్యక్రమం ఉద్దేశమని కేసముద్రం మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు. సోమవారం నాడు రైతు వేదికలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా రహదారి భద్రత లైవ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ గమ్యాన్ని చేరుకోవడమే ఆరైవ్ లైవ్ ప్రధాన దేశమని ఇంటి నుండి బయలుదేరిన వ్యక్తి క్షేమంగా తిరిగి రావడం ముఖ్యమని అతివేగం మొబైల్ వాడకం మద్యపానం సేవించడం వంటి పనులకు వాహనం నడిపేటప్పుడు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ ప్రజలందరూ తమ ప్రాణాలకు సంబంధించిన బాధ్యత హెల్మెట్ ధరించాలని కారులో ప్రయాణం చేసేటప్పుడు సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని అన్నారు మైనర్లు వాహనాలు నడపకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలని రోడ్డు భద్రత అనేది కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు వేగం కన్నా ప్రాణం ముఖ్యం అనే సందేశాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కేసముద్రం సిఐ. సత్యనారాయణ, వైస్ చైర్ పర్సన్ డాక్టర్ అల్లం రమ నాగేశ్వరరావు,జిల్లా ట్రాన్స్పోర్ట్ అథారిటీ మెంబర్ రావుల మురళి,మున్సిపల్ కమిషనర్ టి. శ్రీనివాస్, ఎస్ఐ నరేష్, మండల వ్యవసాయ శాఖ అధికారి బి.వెంకన్న, వార్డు కౌన్సిలర్లు వీరేష్, కిషోర్ ,భారతి, ఉమా, సుభద్ర ,విజయ ,శరత్, రాము ,కృష్ణ ,అరుణ, శారద ,అధికారులు వార్డు ఆఫీసర్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

•కూసుమంచి సీఐ, ఎస్సై సంజీవ్, నాగరాజు.



**పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 13 (తరంగాలు) :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా, రోడ్డు భద్రతపై అవగాహన పెంచేందుకు కూసుమంచి మండలంలో "అరైవ్...అలైవ్" కార్యక్రమాన్ని కూసుమంచి సీఐ సంజీవ్, ఎస్సై నాగరాజుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం కూసుమంచి, జీల్లచెరువు, అగ్రహారం గ్రామాలలో నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ స్థాయి కమిటీలను ఏర్పాటు చేసి, రోడ్డు భద్రత నిబంధనలు పాటించేందుకు గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, గ్రామ పెద్దలతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహన పొందారు. రోడ్ సేఫ్టీ ముఖ్యమైన పాయింట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. హెల్మెట్ / సీట్‌బెల్ట్ తప్పనిసరి, బైక్‌పై ప్రయాణిస్తే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. కారులో సీట్‌బెల్ట్ కట్టుకోవాలి. మద్యం సేవించి వాహనం నడపవద్దు. డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రమాదాలకు ప్రధాన కారణం. వేగ పరిమితి పాటించాలి, అధిక వేగం ప్రమాదాలకు దారి తీస్తుంది. స్పీడ్ లిమిట్ బోర్డులను గమనించాలి. ట్రాఫిక్ నియమాలు పాటించాలి. ట్రాఫిక్ సిగ్నల్స్, సైన్ బోర్డులు తప్పక పాటించాలి. రాంగ్ సైడ్ డ్రైవింగ్ చేయకూడదు. మొబైల్ ఫోన్ ఉపయోగించవద్దు. డ్రైవింగ్ సమయంలో ఫోన్ వాడటం ప్రమాదకరం. ఓవర్‌లోడింగ్ నివారించాలి. వాహనంలో అనుమతించిన వ్యక్తుల కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు. పాదచారుల జాగ్రత్తలు, జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్ దాటాలి. రోడ్ దాటే ముందు రెండు వైపులా చూడాలి. వాహనం సరిగా మెయింటెన్ చేయాలి. బ్రేకులు, లైట్లు, టైర్లు సరిగ్గా పనిచేస్తున్నాయో చూడాలి, రాత్రి సమయంలో జాగ్రత్తలు, హెడ్‌లైట్లు సరిగ్గా వాడాలి. రిఫ్లెక్టివ్ సిగ్నల్స్ గమనించాలి. ఎమర్జెన్సీ నంబర్స్ తెలుసుకోవాలి, ప్రమాదం జరిగితే వెంటనే 100/112 కి కాల్ చేయాలి. అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పెద్దలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



THARANGALU DAILY NEWS
మంగళవారం, 14 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# రెవెన్యూ వ్యవస్థలో నిర్లక్ష్యం అస్సలు సహించం

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఏప్రిల్ 25లోపు 330 స్లాట్ బుకింగ్‌లు క్లియర్ చేయాలి
- భూ భారతి ఆమోదిత దరఖాస్తులు వెంటనే అప్డేట్ చేయాలి
- సాదా బైనామా దరఖాస్తుల్లో తప్పిదాలు అస్సలు ఉండకూడదు



**రెవెన్యూ శాఖపై సంబంధిత అధికారులతో సమీక్ష**

**తరంగాలు ఖమ్మం జిల్లా బ్యూరో :**
రెవెన్యూ వ్యవస్థలో నిర్లక్ష్యం అస్సలు సహించమని, వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను హెచ్చరించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ, భూ భారతీ, సాదా బైనామా, ఇతర రెవెన్యూ సంబంధిత పెండింగ్ అంశాలపై అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అభివృద్ధి పనులు సమయానికి పూర్తి కావాలంటే భూ సేకరణలో ఎటువంటి జాప్యం ఉండకూడదన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూములను గుర్తించి చట్టబద్ధమైన విధానాల ప్రకారం త్వరితగతిన స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ముందుగా పెండింగ్‌లో ఉన్న మెయిన్ కాలువల పనులపై దృష్టి సారించి, అన్ని సమస్యలను పరిష్కరించాలని, రైతులతో చర్చించి వారిని ఒప్పించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ రహదారుల పనులకు సంబంధించిన భూసేకరణ దాదాపు పూర్తయినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో రైతుల వల్ల ఫీల్డ్ స్థాయిలో పనులు నిలిచిపోతున్నా యని తెలిపారు. రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే రైతులతో సమన్వయం చేసుకొని భూములను స్వాధీనం చేసుకోవాలని, చట్టంపై అవగాహన కల్పించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ పనులను అడ్డుకోవద్దని స్పష్టం చేశారు. రికార్డులు పరిశీలించి, నాలా ప్రక్రియలు, లేఅవుట్ అనుమతులు, తదితర అంశాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే పరిహారం ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. మూడవ రైల్వే లైన్‌కు సంబంధించిన పెండింగ్ భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఆమోదం పొంది ఇంకా భూ భారతి పోర్టల్‌లో అప్డేట్ కానీ దరఖాస్తులపై సమీక్షించి అప్డేట్ కాకపోవడానికి గల కారణాలపై తహసీల్దార్లను కలెక్టర్ ప్రశ్నించారు. భూ భారతి పోర్టల్‌లో వివరాలను తక్షణమే అప్డేట్ చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరగా పరిశీలించి నిర్ణయాలు తీసుకోవాలని, నిర్దేశిత కాలపరిమితిలో భూ భారతి దరఖాస్తులను పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఏప్రిల్ 25 లోపు 330 పెండింగ్ స్లాట్ బుకింగ్‌లను తహసీల్దార్లు పూర్తిగా క్లియర్ చేయాలని ఆదేశించారు. పట్టాదారు యాజమాన్యంపై ఎటువంటి సందేహాలు ఉన్నా పరిశీలించి నిబంధనల ప్రకారం పట్టా రద్దు ప్రక్రియను చేపట్టాలని, కానీ ఎట్టి పరిస్థితుల్లోనూ స్లాట్ బుకింగ్‌లను పెండింగ్‌లో ఉంచకూడదని స్పష్టం చేశారు. సాదా బైనామా దరఖాస్తుల విషయంలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ హెచ్చరించారు. సాదా బైనామా ప్రక్రియలో ఎటువంటి తప్పిదం ఉండకూడదని, ఏ చిన్న పొరపాటు జరిగినా తహసీల్దార్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు. ప్రతి దరఖాస్తును స్పష్టంగా, నిబంధనల ప్రకారం పరిశీలించాలని, మంజూరు చేసిన వాటిని క్రాస్ చెక్ చేస్తామని ఎటువంటి అక్రమాలు గుర్తించినా తీవ్ర చర్యలు తీసుకుంటామని తహసీల్దార్లను కలెక్టర్ గట్టిగా హెచ్చరించారు. స్లాట్ బుకింగ్ సేవలను కూడా పూర్తి స్థాయిలో వినియోగం కావడం లేదని అన్నారు. ప్రజలకు స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత 6 నెలల్లో స్లాట్ బుకింగ్ రద్దులకు గల కారణాలతో సమగ్ర నివేదిక అందించాలని కలెక్టర్ ఆదేశించారు. అక్రమ గనుల తవ్వకాలపై పూర్తిస్థాయిలో నియంత్రణ విధించాలని జిల్లా కలెక్టర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా ఎటువంటి గనుల తవ్వకాలు జరగ కూడదని, రెవెన్యూ సిబ్బంది సహకారం లేకుండా అక్రమ మైనింగ్ జరగడం అసాధ్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి స్థాయిలోనే ఈ అంశంపై కఠిన సూచనలు ఉన్నాయని పేర్కొంటూ, ఎక్కడైనా అక్రమ తవ్వకాలు గుర్తించిన వెంటనే కేసులు నమోదు చేసి, వాహనాలను స్వాధీనం చేసుకోవడంతో పాటు పోలీస్ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా ఎటువంటి వాహనాన్ని విడుదల చేయరాదని హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా చేసిన వారిపై 10 వేల, 20 వేలు వంటి చిన్నపాటి జరిమానాలు విధించడం కాకుండా, తప్పనిసరిగా వాహనాలను సీజ్ చేసి, ఆర్‌సీని కూడా స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లాలోని తహసీల్దార్లు, ఇరిగేషన్, నేషనల్ హై వే, రైల్వేస్, సర్వే ల్యాండ్ రికార్డ్స్, ఏడి మైన్స్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్‌తో 30 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం



**నల్లబెల్లి, ఏప్రిల్ 13 తరంగాలు :**
నల్లబెల్లి మండలం మూడు చెక్కలపల్లి గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జరిగిన ప్రమాదంతో భారీగా మొక్కజొన్న పంట దగ్ధమై బూడిదైన ఘటన చోటుచేసుకుంది. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జరిగిన షార్ట్ సర్క్యూట్ కారణంగా సుమారు 30 ఎకరాల మేర మొక్కజొన్న పంటతో పాటు రాశులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి.
సుమారు రూ.30 లక్షల విలువ చేసే పంట నష్టపోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఎండ వేడిమి కారణంగా ఎండిపోయిన మొక్కజొన్న కండలు మంటలు అంటుకొని క్షణాల్లోనే పంట అంతా దగ్ధమైపోయింది. రైతుల ఆర్తనాదాలు మిన్నంటాయి.ఈ ప్రమాదంలో గుగులోతు హేమా, పున్నం నాగలక్ష్మి, పున్నం చంద్రు, ఇస్లావత్ ధర్మ, ఇస్లావత్ విజేందర్, ఇస్లావత్ రవి, ఇస్లావత్ లూలా, ధరావత్ ఆలు, భూక్య మహేందర్ తదితర రైతుల పంటలు పూర్తిగా నాశనమయ్యాయి.సమాచారం అందుకున్న వెంటనే ములుగు, నర్సంపేట ప్రాంతాల నుండి ఫైర్ ఇంజన్లు సంఘటన స్థలానికి చేరుకున్నప్పటికీ, అప్పటికే మంటలు అదుపులోకి రాకపోవడంతో పెద్ద నష్టం జరిగింది.ఈ ఘటనపై మూడు చెక్కలపల్లి సర్పంచ్ సపావట్ కవిత దేవు నాయక్ బాధిత రైతులను పరామర్శించారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాధిత రైతులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# బిజెపి మహిళా నాయకురాలికి అండగా వాక్ ఫౌండేషన్

- పిట్ట సరస్వతికి చెక్కు అందజేసిన బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ



**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 14,తరంగాలు** : అనారోగ్యంతో బాధపడుతున్న బిజెపి సీనియర్ మహిళ నాయకురాలికి వాక్ ఫౌండేషన్ ద్వారా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకట రమణ ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు. వరంగల్ జిల్లా 14 వ డివిజన్ బీజేపీ సీనియర్ మహిళ నాయకురాలు పిట్ట సరస్వతి తీవ్రమైన కిడ్నీ ఇన్ఫెక్షన్ తో బాధపడుతుంది.విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ వారి స్వగృహానికి వెళ్లి వారి ఆరోగ్యక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం వారి వాక్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ వాక్ సమైక్య ఫౌండేషన్ ద్వారా గత 16 సంవత్సరాల నుండి పేదల సహాయం కొరకు స్థాపించి, సుమారు 600 పై చిలుక కుటుంబాలకు వర్ధన్నపేట నియోజకవర్గం లోని పలు గ్రామాలలో నెలకు 10 కిలోల ఉచిత బియ్యం, ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, వారి కంటి చూపు కొరకు ఆపరేషన్లు చేయించడం జరిగింది. అంతేకాకుండా తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలు, పేద పిల్లలు చదువుల కొరకు ఆర్థిక సహాయం, ప్రభుత్వ పాఠశాలలో ఉచిత నోట్ బుక్స్ పంపిణీ,అనారోగ్యంతో ఉన్న పేదవారికి వారి చికిత్స కొరకు ఆర్థిక సహాయం వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, సీనియర్ నాయకులు ఎరుకల రఘునారెడ్డి, ఎస్సీ మోర్చా నాయకులు మాదాసు రాజు , దామెర సదానందం,దండు చక్రపాణి,తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.

# అక్రమనిర్మాణాలపై అధికారుల అలసత్వం




- తల్లంపాడులో కరెంట్ తీగలకింద
- ఇందిరమ్మ ఇండ్లనిర్మాణం.
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు.
- గ్రీవెన్స్ ఫిర్యాదుపై కూడా స్పందించని వైనం.
- సామాన్యుల ఫిర్యాదులు చెత్తబుట్టకే పరిమితమా..?
- రోడ్లు ఆక్రమించి అక్రమనిర్మాణాలపై నోరుమెదపరా..?
- అధికారులే స్పందించకుంటే ఎవరికి చెప్పాలి..?
- ప్రగతి ప్రణాళిక గ్రామసభలో ఫిర్యాదు చేసినా

**ఫలితం శూన్యం.**

పాలేరు ఆర్సీ, ఏప్రిల్ 12 :( తరంగాలు ). తల్లంపాడు గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు విద్యుత్ తీగలకింద నిర్మిస్తున్నా, పంచాయతీ అంతర్గత రహదారులు ఆక్రమించి నిర్మాణాలు కొనసాగిస్తున్నారని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా మండల రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖ అధికారులు కనీసం పట్టించుకోకుండా అక్రమార్కులకు కొమ్ము కాస్తున్నారని గ్రామానికి చెందిన రాయబారపు రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు...గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొందరు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకుంటున్నారు. వారు తమకు చెందిన ఇంటిస్థలం హద్దులు దాటి పంచాయతీ రోడ్డు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని గ్రీవెన్స్ (ప్రజావాణి) లో దరఖాస్తు చేసుకున్నా అధికారులు కనీసం సంబంధిత నిర్మాణదారునికి నోటీసులు జారీ చేయకుండా ఇంటి బిల్లులు మంజూరు చేస్తున్నారని రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో గతంలో ఇండ్ల ప్లాట్లు ఇచ్చినప్పుడు 1986వ సంవత్సరంలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లే హద్దులుగా ఉన్నాయని, అయినా ఇంటి నిర్మాణ దారులు కావాలని విద్యుత్ లైన్ కింద నిర్మాణాలు చేపట్టడమే కాకుండా తమ ఇంటికి విద్యుత్ లైన్ అడ్డుగా ఉందని, తీగలు మార్చాలని సంబంధిత శాఖకు దరఖాస్తులు చేస్తే అధికారులు వారిని విద్యుత్ లైన్ ముందు ఏర్పాటు చేశారా..? ఇంటినిర్మాణం ముందు చేశారా...? అని ఆరా తీయకుండా కనీసం పట్టించుకోకపోవడం ఏంటని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. ప్రజావాణి దరఖాస్తు బుట్టదాఖలు..



ప్రజావాణిలో పలుమార్లు దరఖాస్తు చేసినా అధికారులు కనీసం పట్టించుకోకుండా బిల్లులు చేయడంతో నిర్మాణదారుడు రెచ్చిపోయి బజారు ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్నాడని ఆరోపిస్తున్నారు. ప్రజావాణి దరఖాస్తుపై ఎంపీవో శ్రీదేవి స్పందించి తమ దగ్గర ఏరకమైన రికార్డు లేదని దాటవేసే సమాధానం చెప్పి తప్పించుకున్నారని రమేష్, ఇతర కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
తక్షణమే కలెక్టర్ చర్యలు తీసుకోవాలి..
ప్రజావాణి ఫిర్యాదులపై చర్యలు తీసుకోకుండా అధికారపార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ సామాన్యుల ఆరోపణలు పట్టించుకోకుండా విద్యుత్ తీగలకింద, బజారు ఆక్రమించి ఇంటిని నిర్మిస్తున్న సదరు యజమానిపై తక్షణమే కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజాపాలన, ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో కూడా ఫిర్యాదు చేసినా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత ఫిర్యాదు దారు డిమాండ్ చేస్తున్నాడు.

# ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి





- వర్ధన్నపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాడమే లక్ష్యం
- వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- వీలైనంత త్వరగా భూమికి బౌండరీలు ఏర్పాటు చేయాలి
- 100 పడకల హాస్పిటల్ కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 13,తరంగాలు :ప్రజల ఆరోగ్యంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, వర్ధన్నపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాడమే లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు.వరంగల్ జిల్లా వర్ధన్నపేట పట్టణంలో నిర్మించనున్న 100 పడకల హాస్పిటల్‌కు కేటాయించిన దేవాదాయ శాఖ భూమిని వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కె.ఆర్ నాగరాజు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే, వీలైనంత త్వరగా భూమికి బౌండరీలు ఏర్పాటు చేయాలని సంబంధిత రెవెన్యూ అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ వర్ధన్నపేట ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 100 పడకల ఆధునిక హాస్పిటల్ నిర్మాణానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. పట్టణ ప్రజలకు సమీపంలోనే అన్ని సౌకర్యాలతో కూడిన ఆసుపత్రి అందుబాటులోకి వస్తే పేద ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. ఈ హాస్పిటల్ నిర్మాణం ద్వారా వర్ధన్నపేట నియోజకవర్గంలోని వేలాది మంది ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు లభిస్తాయని, అత్యవసర పరిస్థితుల్లో వేగంగా చికిత్స అందేలా అన్ని ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. దేవాదాయ శాఖ భూమిని హాస్పిటల్ నిర్మాణానికి కేటాయించినందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఆధునిక వైద్య సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే నాగరాజు పేర్కొన్నారు. త్వరలోనే హాస్పిటల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా అవసరమైన చర్యలు వేగవంతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి, వైస్ చైర్మన్ శిభారాణి రాజేందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యం, కౌన్సిలర్లు పాపారావు, కమిలిఖీమానాయక్, దేవేందర్, వాణి కుమారస్వామి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తుల్లా రవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పోశాల వెంకన్న, నాయకులు రామకృష్ణ, మహేందర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజావాణి కార్యక్రమానికి 168 అర్జీలు



**హనుమకొండ ప్రతినిధి, ఏప్రిల్ 13,తరంగాలు** :హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.
ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వినతులను అందించేందుకు వచ్చిన ప్రజల నుండి జిల్లా అదనపు ఎన్. రవి, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కన్నం నారాయణ అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు 168 అర్జీలను అందజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందజేసిన దరఖాస్తులను సంబంధిత అధికారులను పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్, ఆర్డీవోలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్డివో మేన శ్రీను, జడ్పి సీఈవో శేషాద్రి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- రోడ్డు భద్రతపై అవగాహనపై గోడపత్రాలు ఆవిష్కరించిన కలెక్టర్
- హనుమకొండ,



**ఏప్రిల్ 13,తరంగాలు :** రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ప్రజాపాలన-- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుండి 18 వరకు నిర్వహిస్తున్న రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాల్లో భాగంగా సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించే గోడపత్రాలు, కరపత్రాలను కలెక్టరేట్ లో విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ప్రమాదకర అలవాట్లను పూర్తిగా నివారించాలని హెచ్చరించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి ప్రచార కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖాధికారి వేనుగోపాల్, సీనియర్ మోటార్ వాహనాధికారి రమేష్ రాథోడ్, ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు, మోటార్ వాహనాధికారి కిషోర్ బాబు, ఉదయకీర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఉపేంద్ర ఆసుపత్రి సీజ్





నెక్కొండ, ఏప్రిల్ 13,తరంగాలు : క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం ఎలాంటి అనుమతి లేకుండా సేవలందిస్తూ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయిస్తున్న నెక్కొండ లోని ఉపేంద్ర ఆసుపత్రి ని సీజ్ చేసినట్లు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రకాష్ తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు ఆదేశాల మేరకు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్యశాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా ఆకస్మిక తనిఖీ చేసి నెక్కొండ లోని ఉపేంద్ర హాస్పిటల్ సీజ్ చేశారు. గత కొన్ని నెలల నుండి అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హాస్పిటల్లో ఇన్ పేషెంట్లు అవుట్ పేషెంట్లు సేవలు అందిస్తున్నారు . క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం అనుమతి లేకుండానే సేవలందిస్తూ, గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయిస్తున్న క్రమంలో గతంలో ఎఫ్ఐఆర్ పిఎస్ నెక్కొండలో నమోదు చేయడం జరిగినది. ఈమధ్య లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న ముఠా వ్యక్తులను పోలీసులు ఇన్వెస్టిగేషన్ చేస్తున్న క్రమంలో ఐనవోలు మండలం పున్నేలు గ్రామంలోని తల్లి బిడ్డల మరణానికి గర్భస్థ లింగ నిర్ధారణ చేయిస్తున్నారని పిఎస్ ఐనవోలు పోలీసుల ద్వారా ఎఫ్ఐఆర్ చేయడం జరిగింది . ఈ సందర్భంగా నర్సంపేట డిప్యూటీ ఎంహెచ్ఓ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ ఆక్ట్...పి సి పి ఎన్ డి ఆక్ట్ ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ద్వారా అనుమతి తీసుకుని మాత్రమే క్లినికులు గాని, ఆసుపత్రులు గాని, ల్యాబ్స్ గాని నిర్వహించాలని తెలిపారు . వీటికి వ్యతిరేకంగా ఎవరు వైద్య సేవలు అందించిన అట్టి వారి పైన చర్యలు తీసుకుంటామని తెలిపారు . ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారికి డాక్టర్ విజయ్ కుమార్, స్థానిక వైద్యాధికారిని డాక్టర్ రహేలా తన్వీర్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి , కానిస్టేబుల్ రమేష్, హోమ్ గార్డ్ సురేందర్, వైద్య ఆరోగ్యశాఖలోని వివిధ కేడర్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి బాధ్యత

- జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్




**నల్గొండ అర్బీ, ఏప్రిల్ 13, తరంగాలు** :ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. రోడ్డు భద్రతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ట్రీ అవగాహన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ప్రారంభించారు. సోమవారం క్లాక్ టవర్ సెంటర్లో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు సేఫ్టీ అవగాహన కార్యక్రమాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. జీవితం విలువైనది అనే సందేశంతో రోడ్డు సేఫ్టీ వృక్షాన్ని ప్రతీకగా చూపిస్తూ, మనిషి జీవితాన్ని రక్షించుకోవడం ఎంత ముఖ్యమో వివరిస్తూ అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించినప్పుడు ప్రమాదం జరిగినా ఎలా రక్షణ లభిస్తుందో, హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే ఎలాంటి ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయో ప్రదర్శన ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, డి టి ఓ లావణ్య ,వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి,మోటారు ఇన్స్పెక్టర్లు కొండయ్య ,మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి ,ఉషశ్రీ ,సోనిప్రియ, చిరంజీవి, గోపీనాథ్, నరేందర్ రెడ్డి, రవి పాల్గొన్నారు.

THARANGALU DAILY NEWS
మంగళవారం, 14 ఏప్రిల్, 2026
జాతీయ దిన పత్రిక
తరంగాలు

# అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలి



• జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్

**నల్గొండ అర్బీ, ఏప్రిల్ 13, తరంగాలు** :మండలాల ప్రత్యేక అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సందర్భంగా రబి ధాన్యం సేకరణ పై మాట్లాడుతూ రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అన్ని మండలాల్లో అధికారులు క్రమం తప్పకుండా ఫీల్డ్ విజిట్ చేయాలని సూచించారు. రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూడాలని, ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలిపారు. రైతులను ఇబ్బంది పెట్టే ఎవరిపైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. హాస్టల్ల తనిఖీలలో భాగంగా ఎం ఎస్ ఓ లు ఆర్సీవోలు, ప్రిన్సిపాళ్ల ఆయా విభాగాల నుండి నివేదికలను త్వరగా సమర్పించాలని ఆదేశించారు. గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న కుక్కల సంఖ్యపై సమాచారం సేకరించాలని ,ఫీమేల్, మేల్ కుక్కల వివరాలను ప్రత్యేక ఫార్మాట్‌లో సేకరించి పంపాలని, గ్రామపంచాయతీ ద్వారా డిపివో, మున్సిపల్ కమిషనర్లకు పంపించాలని సూచించారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఈనెల 13 నుండి 18 వరకు నిర్వహిస్తున్న అరైవ్ అలైవ్ కార్యక్రమం సందర్భంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ఏప్రిల్ 15 నుంచి కలెక్టరేట్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్ ధరించి కార్యాలయానికి రావాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా వచ్చిన వారికి కార్యాలయంలో ప్రవేశం ఉండదని తెలిపారు. కార్లలో వచ్చే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని ఆదేశించారు.జిల్లాలోని ప్రైవేట్ మరియు ప్రభుత్వ పాఠశాలల వద్ద రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల ముందు జీబ్రా క్రాసింగ్ లైన్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ కూడళ్ల వద్ద జీబ్రా లైన్లు, ట్రాఫిక్ నిబంధనల సూచికలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రమాదాలు జరిగే క్రిటికల్ పాయింట్ల వద్ద లైనింగ్ పనులు 3 నుంచి 4 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో 8 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అక్కడ వార్నింగ్ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, ఈ పనిని ఒక నెలలో పూర్తి చేయాలని సూచించారు.రోడ్డు భద్రతపై గ్రామ స్థాయిలో అవగాహన పెంపొందించేందుకు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని, వార్డ్ ఆఫీసర్ల ద్వారా వార్డ్ కమిటీలు ఏర్పాటు చేసి వాటి జాబితాను మున్సిపల్ కమిషనర్ కు గ్రామపంచాయతీ రోడ్ సేఫ్టీ కమిటీ డీపీఓ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.ఈ సోమవారం రెవెన్యూ శాఖకు 71 ఇతర శాఖలకు 55 ఫిర్యాదులు వచ్చాయి.ఈ సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, చండూర్ ఆర్డీవో శ్రీదేవి, దేవరకొండ ఆర్ డి ఓ రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.



# బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలి





**వరంగల్ ప్రతినిధి, ఏప్రిల్ 13,తరంగాలు** :రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన–-ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో "'అరైవ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు ఈ నెల 13వ తేదీ నుండి 18వ తేదీ వరకు హనుమకొండ, వరంగల్, జనగామ జిల్లాల పరిధిలో నిర్వహించబడుతున్నాయి.ఈ నేపథ్యంలో సోమవారం హనుమకొండలోని కాళోజి కళాక్షేత్రంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఎల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం రోడ్డు భద్రత ప్రాముఖ్యతపై ప్రసంగిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని, బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు.పోలీసుల కళాజాతా, తెలంగాణ సాంస్కృతిక సారథి, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు రోడ్డు భద్రతపై నిర్వహించిన సామూహిక కార్యక్రమాలు ఆకట్టుకోగా,ప్రజల్లో అవగాహన పెంచి కన ంవిప్పు కలిగించాయి.అంతకుముందు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో కాళోజి కళాక్షేత్రం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లలో రోడ్డు భద్రతపై ప్రదర్శించిన ఎగ్జిబిట్లను ఎమ్మెల్సీ, పోలీస్ కమిషనర్, జిల్లా కలెక్టర్లు సందర్శించి తిలకించారు.ఈ కార్యక్రమంలో డిసిపి లు ధార కవిత, అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్లు సంధ్యారాణి, రవి, అదనపు డిసిపి ప్రభాకరరావు, పోలీస్, రవాణా, రెవెన్యూ శాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, సర్పంచులు, కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.





## అంబేద్కర్ 135వ జయంతి..అజయ్ పురం గ్రామంలో బైక్ యాత్ర ప్రారంభం



అనకాపల్లి,ఏప్రిల్13 అనకాపల్లి జిల్లా రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ అజయ్ పురం గ్రామంలో గిరిజన సంఘం., కెవిపిఎస్ సంఘాల ఆధ్వర్యంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళి అర్పించారు.అజయ్ పరువు నుండి జోగంపేట, నేరేడు బంధ, కళ్యాణ్ లావా వరకు బైకే యాత్ర నిర్వహించడం జరిగింది. ఎస్సీ ఎస్టీ చట్టాన్ని ఆర్టికల్ 9 షెడ్యూల్లో చేర్చాలని, నాన్ షెడ్యూల్ గిరిజన మండలాలను ఏజెన్సీ ఏరియాలో కలపాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని కోరారు. రావికతం మండల కేంద్రంలో సర్వేనెంబర్ అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న చెత్తను తొలగించాలి. బాదంపాడు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 41-లో 5-80 చెట్లు భూమిలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దళితులకు, గిరిజలకు కేటాయించాలి బాదంపాడు రెవిన్యూ పరిధిలో సీలింగ్ భూమి చుట్టూ బౌండరీ ఏర్పాటు చేయాలని తెలిపారు. దళితులకు గిరిజనులకు పట్టాలి ఇవ్వాలి. కొత్తకోట దళిత కాలనీకి మంచినీరు సౌకర్యం కల్పించాలి. గిరిజనులు సాగులోన భూములకు, సాగకు కల్పించి, గిరిజనులకు దళితులకు రక్షణ కల్పించాలన్నారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మోనాటరింగ్ కమిటీలో గిరిజనులకు ప్రాతినిధ్యం కల్పించాలని, జెడ్ జోగంపేట పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. నర్సీపట్నం నుండి జెడ్ జోగిపేట్ వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, దళితులకు గిరిజనులకు ఇచ్చిన అధిక బిల్లులు తగ్గించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దళితులకు గిరిజనులకు నర్సీపట్నంలో ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సాయి కార్యదర్శి కే గోవిందరావు. గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పాంగి చంద్రావు. పాంగి పవన్ కుమార్. వంతల చిరంజీవి. గేమిల రాజు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు.. మరోమారు పిటిషన్ దాఖలు చేసిన సునీత

హైదరాబాద్,ఏప్రిల్13: మాజీమంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసు దర్యాప్తు వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో తదుపరి దర్యాప్తును కొనసాగించేలా కేంద్ర దర్యాప్తు సంస్థకు ఆదేశాలు ఇవ్వాలంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను వివేకా కూతురు సునీతా రెడ్డి దాఖలు చేశారు. ఈ కేసులో కొన్ని కోణాలపై సీబీఐ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయలేదని, పలు అనుమానాలకు సమాధానాలు రాలేదని ఆమె తన పిటిషన్‌లో పేర్కొన్నారు. అందువల్ల మరింత సమగ్ర తదుపరి దర్యాప్తు జరపాలని హైకోర్టును కోరారు. ఈ కేసు ఇప్పటికే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తులో ఉంది. గతంలో సీబీఐ కోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం కొన్ని వ్యక్తుల మధ్య జరిగిన ఫోన్ కాల్ డేటా సహా పలు సాంకేతిక ఆధారాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టింది. తదుపరి దర్యాప్తులో కొందరి పాత్ర లేదని పేర్కొంటూ సీబీఐ కోర్టుకు ఛార్జ్‌షీట్ కూడా దాఖలు చేసింది. అయితే ఈ దర్యాప్తుపై పిటిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సునీతా రెడ్డి తన పిటిషన్‌లో పలు కీలక విషయాలను పేర్కొన్నారు. పలు సందేహాలకు సీబీఐ దర్యాప్తులో సమాధానం రాలేదని తెలిపారు. కొన్ని కోణాల్లో విచారణ పూర్తిగా జరగలేదని అన్నారు. ఈ కేసులోని కొన్ని అనుమానాస్పద అంశాలను విస్మరించారని అభ్యంతరం వ్యక్తం చేశారు. అందువల్ల సీబీఐ కోర్టు ఉత్తర్వులను రద్దు చేసి, కేసులో ఇంకా స్పష్టత లేని అంశాలపై మరింత దర్యాప్తు చేయాలని ఆదేశించాలంటూ ఆమె హైకోర్టును అభ్యర్థించారు. ఈ పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ జరుగుతోంది.

## ఒంటరి వృద్ధురాలిపై దాడి

- **రోకలిబండతో బాదిన దుండుగులు**
- **బంగారం దోచుకుని పరార్**

కామారెడ్డి,ఏప్రిల్13 కామారెడ్డి జిల్లాలోని భిక్కనూరు మండల కేంద్రంలో జరిగిన దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఇంట్లోకి చొరబడి ఓ వృద్ధురాలిపై రోకలిబండతో దాడి చేసి, ఆమె బంగారు ఆభరణాలను అపహరించిన ఘటన ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండల కేంద్రంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు తన ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ఆమెపై అకస్మాత్తుగా దాడికి పాల్పడ్డారు. దాడికి రోకలి బండను ఉపయోగించినట్లు సమాచారం. ఈ దాడిలో వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. దాడి సమయంలో ఆమె అరుస్తూ సహాయం కోరినప్పటికీ, దుండగులు ఆమె బంగారు ఆభరణాలను బలవంతంగా లాక్కొని పరారయ్యారు. వాటి విలువ ఎంతన్నది పూర్తిగా నిర్ధారణ కాలేదు. ఈ ఘటనలో వృద్ధురాలి తలకు తీవ్ర గాయాలైనట్లు వైద్యులు తెలిపారు. రక్తస్రావం అధికంగా ఉండటంతో స్థానికులు వెంటనే స్పందించి ఆమెను సమీప ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ దారుణ ఘటనతో భిక్కనూరు ప్రాంత ప్రజల్లో భయాందోళన నెలకొంది. వృద్ధురాలిపై ఇంతటి క్రూరమైన దాడి జరగడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# సికేఎం ఆసుపత్రికి వెళ్ళండి




- వర్ధన్నపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చిన రోగులకు వైద్యుల సూచన
- వైద్య సేవలో నిండా నిర్లక్ష్యం
- జిల్లా కలెక్టర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే పట్టించుకోవాలని వినతి

వర్ధన్నపేట ప్రతినిధి, ఏప్రిల్ 13,తరంగాలు : వర్ధన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి అధ్వానంగా మారింది. పాలకులు, పాలనాధికారులు పట్టింపులేక నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.ఒకప్పుడు ఈ ఆసుపత్రిలో ఎక్కువ ప్రసవాలు చేసిన మంచి పేరు ఉంది. అయితే నిర్వహణ లోపమా...? లేక వైద్యుల నిర్లక్ష్యమా తెలియడం లేదు కానీ ప్రసవం కోసం వస్తే మాత్రం గర్భిణులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. రాదు అన్న పని రాజా పని అన్నట్లు ఆసుపత్రికి వచ్చిన రోగులను సికేఎం ఆసుపత్రి కి రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రమే ఆసుపత్రిలో హడావుడి కనిపిస్తుందని వారు వెళ్ళిన తర్వాత ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందని పలువురు ఆరోపిస్తున్నారు.సోమవారం తెల్లవారు జామున సుమారు 2గంటలకు కట్రీయాల గ్రామానికి చెందిన ఒక గుర్భవతి కి నొప్పులు రావడం తో వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే ఆ పేషెంట్ కు నొప్పులు తగ్గడానికి ఒక ఇంజక్షన్ ఇచ్చారు. ఉదయం వరకు ఆ పేషెంట్ కు ఎలాంటి చికిత్స చేయలేదని వారి కుటుంబ సభ్యులు వాపోయారు. అంతేకాకుండా డాక్టర్లు 12 గంటల వరకు రారు..మీకు ఇబ్బందిగా ఉంటే సికేఎం ఆసుపత్రికి వెళ్ళండని సిబ్బంది రోగి బంధువులకు చెప్పడం తో చేసేదేమిలేక వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి నుండి సికేఎం ఆసుపత్రికి తీసుకువెళ్లినట్టు రోగి బంధువులు తెలిపారు.ఆసుపత్రి లో ఇంత మంది వైద్యులు ఉండి కూడా ఆసుపత్రికి వచ్చిన రోగులకు చికిత్స అందించకుండా వరంగల్ లోని సీకేఎం ఆసుపత్రికి పంపించడం లో ఆంతర్యం ఏమిటో మండల ప్రజలకు అర్థం కాని పరిస్థితి నెలకొంది.ఇప్పటికైనా వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రి పై ప్రత్యేక శ్రద్ధ చూపి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన విజయ్ దేవరకొండ, రష్మిక




'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ - రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ - రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 - 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.

# పల్లవి మోడల్ స్కూల్ విద్యార్థిని సింధుకు జాతీయ స్థాయి గుర్తింపు






హర్షం వ్యక్తం చేసిన పాఠశాల యాజమాన్యం

**పర్వతగిరి, ఏప్రిల్ 13,తరంగాలు** : విద్యతో పాటు క్రీడలకు సమాన ప్రాధాన్యతనిస్తూ విద్యార్థుల సర్వతోముఖ అభివృద్ధికి కృషి చేస్తున్న అన్నారం పల్లవి మోడల్ స్కూల్ క్రీడా రంగంలో మరో గొప్ప విజయాన్ని సాధించింది. ఆ పాఠశాలకు చెందిన క్రీడాకారిణి డి.ఎస్. సింధు జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్‌కు ఎంపికై పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచింది.ఫిబ్రవరి 7 నుండి 9 వరకు నెల్లికుదురు మండలంలో నిర్వహించిన 69వ నేషనల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-14 తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలికల సాఫ్ట్ బాల్ పోటీలో వరంగల్ జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన సింధు, తన అద్భుతమైన ప్రదర్శనతో జాతీయ స్థాయికి ఎంపిక కావడం విశేషం.ఈ నెల 16 నుండి 22 వరకు ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో ఆమె పాల్గొననుంది.ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ రాచాకొండ అశోకచారి సింధు ప్రతిభను కొనియాడుతూ, ఇది పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. కరస్పాండెంట్ గంజి మహేందర్, డైరెక్టర్ కొటగిరి రమేష్,డైరెక్టర్ అండ్ స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ ఆకుల రాజు , ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ, సింధు క్రమశిక్షణ, పట్టుదల, కోచ్ మార్గదర్శకత్వం వల్లే ఈ విజయం సాధ్యమైందని అభినందించారు.సింధు జాతీయ స్థాయిలో కూడా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సింధు మరియు ప్రశాంత్ ను పాఠశాల మేనేజ్మెంట్ ఘనంగా సన్మానించింది.సింధు సాధించిన ఈ విజయం తోటి విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని యజమాన్యం తెలిపారు.



## భరతవర్ష్ మూవీతో వస్తోన్న గోపీచంద్




యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు

ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

## జననాయగన్'ను పైరసీ వ్యవహారం

ఆరుగురిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు

కోలీవుడ్ అగ్రకథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జననాయగన్'ను పైరసీ భూతం వేధిస్తోన్న విషయం తెలిసిందే. విడుదలకు ముందే ఈ సినిమా ఆన్‌లైన్‌లో లీక్ కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చిత్రబృందం ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆరుగురుని అరెస్ట్ చేశారు. దీనిపై చిత్రబృందం తరఫు లాయర్ పోస్ట్ పెట్టారు సినిమాను లీక్ చేసినందుకు సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసింది. సోషల్ మీడియా వేదికగా లీకైన సీన్‌లను ఏ రూపంలోనైనా డౌన్‌లోడ్ చేసినా, షేర్ చేసినా వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. పైరసీని ఫార్వర్డ్ చేసిన వ్యక్తులను కూడా గుర్తించి తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటాం అని నోటీసులు విడుదల చేశారు.

## బాలకృష్ణ, గోపీచంద్ కాంబో

### థమన్ మ్యూడిజక్ డైరెక్టర్‌గా ఫిక్స్

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.